# సీఎం కేసీఆర్ వెంటే దుబ్బాక జనం



దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లిలో అంబేద్కర్, గాంధీ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

- బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- కాంగ్రెస్, బీజేపీలకు విజన్‌లేదు
- దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మల్లేశంపల్లిలో అంబేద్కర్, గాంధీ, తెలంగాణతల్లి విగ్రహాల ఆవిష్కరణ

రాయపోల్, అక్టోబర్ 5 : అభివృద్ధి ప్రదాత, సంపదను పెంచి పేదలకు పంచే సీఎం కేసీఆర్ వెంటే దుబ్బాక ప్రజానీకం ఉందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలంలోని ముబారస్‌పూర్, హైమదీనగర్ గ్రామా ల్లో కమ్యూనిటీ హాళ్లకు భూమి పూజ చేశారు. మల్లేశంపల్లి చౌరస్తాలో సర్పంచ్ దారా సత్యనారాయణ ఏర్పాటు చేయించిన అంబేద్కర్, గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించారు. ఎంపీ నిధులతో నిర్మించిన బీసీ కమ్యూనిటీహాల్ భవనాన్ని సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాతతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు దొంగ నాటకాలకు తెర తీశారని ఆరోపించారు. చౌకబారు విమర్శలు చేయడం సిగ్గులేకుండా తిరుగుతున్నారని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వాలు రైతుబంధు, రైతు బీమా, 24 గంటలు కరెంట్ ఎందుకు ఇవ్వలే దని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పాదయాత్రల పేరుతో వస్తున్న నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోయి గోసపడొద్దన్నారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

**యువతకు అండగా ఉంటాం**

యువతకు అండగా ఉంటామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల అహ్మద్‌నగర్‌లోని బీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన దౌల్తాబాద్, రాయపోల్ మండలాలకు చెందిన 600 మందికి లెర్నింగ్ పత్రాలతోపాటు హెల్మెట్లు అందజేశారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలోని యువతకు లైసెన్స్‌తోపాటు హెల్మెట్లను అందిస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో యువకులు ఆగం కావొద్దన్నారు.

**మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప మహనీయుడని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, గాంధీ విగ్రహాలను సోలిపేట సుజాతతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారవీందర్, జడ్పీటీసీ రణం జ్యోతీశ్రీనివాస్‌గౌడ్, ఎంసీటీసీ తిరుపతి, సర్పంచ్ దారా సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అల్లి శేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు రహీమొద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు పూజిత, మాజీ ఎంపీపీ దారా వరలక్ష్మి, సర్పంచులు యాదగిరి, అప్పవారు శ్రీను, నర్సింహులు, మండల కోఆప్షన్ సభ్యులు హైమద్, మాజీ సర్పంచ్ మోహన్‌రావు, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు యాదవరెడ్డి, నాయకులు ఇప్ప దయాకర్, రాజిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.



యవతకు లెర్నింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్లు అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

# 'మల్లన్న'ను దర్శించుకున్న మంత్రి సత్యవతి రాథోడ్

- సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రావాలని పూజలు
- ఘన స్వాగతం పలికిన ఆలయవర్గాలు

చేర్యాల, అక్టోబర్ 5 : కొమురవెల్లి మల్లికార్జున స్వామిని గురువారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకున్నారు. ఆలయానికి మొదటిసారిగా వచ్చిన మంత్రికి ఆలయవర్గాలు పూర్ణకుంభం స్వాగతం పలికాయి. అనంతరం ఆమె స్వామి వారిని దర్శించుకుని సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ విజయం సాధించాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు మంత్రికి స్వామివారి శేషవస్త్రాలతోపాటు తీర్థప్రసాదాలు, మెమొంటో అందజేశారు. ఆమె వెంట ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీలాశేఖర్ తదితరులు ఉన్నారు. ఆలయానికి వచ్చిన మంత్రిని కొమురవెల్లి జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, ఎంపీపీ తలారీ కీర్తనాకిషన్, కొమురవెల్లి ఉపసర్పంచ్ కొండా శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు మహేశ్, సత్యం, కొమురెల్లి, బూరుగు స్వామిగౌడ్ సన్మానించారు.

# నేటి నుంచి విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహారం

- మెనూలో కిచిడీ, ఉప్మా, పొంగల్..
- ప్రభుత్వ దసరా కానుకగా అల్పాహారం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 5 : నేటి విద్యార్థులే.. రేపటి నవ సమాజ నిర్మాతలని గ్రహించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా 'మనఊరు–మనబడి' కార్యక్రమాన్ని ప్రారంభించి.. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, వారు ఏకాగ్రతగా చదువుకోవాలనే ఉద్దేశంతో అల్పాహారం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం మానవతా దృక్పథంతో ఆలోచించిన సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజనంతోపాటు 'ముఖ్యమంత్రి అల్పాహారం పథకం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా గొప్ప విషయమని తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని మొదట ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించగా, తాజాగా ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**జిల్లాలో 1,06,000 మంది విద్యార్థులకు ప్రయోజనం**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అన్ని తరగతుల విద్యార్థులు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,013 ప్రభుత్వ పాఠశాలల్లో 1,06,000 మంది విద్యార్థులకు అల్పాహార పథకం అందనున్నది. జిల్లాలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులు.. 7,340 మంది ఉండగా, రెండో తరగతిలో 10,302 మంది, మూడో తరగతిలో 8,620, నాలుగో తరగతిలో 9,643 ఐదో తరగతిలో 9,079, ఆరో తరగతిలో..8,398, ఏడో తరగతిలో 10,070, ఎనిమిదో తరగతిలో..9,152 మంది, తొమ్మిదో తరగతిలో 9,254 మంది, పదో తరగతిలో 9,196 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ రోజూ ఉదయం అల్పాహారం అందించనున్నారు.

**పోషకాలతో కూడిన అల్పాహారం**

బడికి తొందరగా వెళ్లాలన్న ఆతృతతో విద్యార్థులు ఖాళీ కడుపులతో వస్తున్నారని, దీంతో పోషకాహారం లోపించి విద్యార్థులు నీరసించి పోయి అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో ప్రభుత్వం రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు అల్పాహారాన్ని ప్రవేశపెట్టింది. రేపటి నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' ప్రారంభం కానున్నది. అల్పాహారం మెనూలో రవ్వ, ఉప్మా, పొంగల్, కేసరి, కిచిడీ వంటి పదార్థాలను అందించనున్నారు. ఇప్పుడు అందిస్తున్న రాగిజావ, ఉడికించిన కోడిగుడ్లు ఎప్పటిలాగే అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇప్పటికే పోషకాలతో కూడిన ఆహారం అందిస్తుండగా, ఇప్పుడు అందించే అల్పాహారంతో విద్యార్థులు మరింత శారీరకంగా, మానసికంగా ఎదిగే అవకాశం ఉంటుంది.

# ఆర్టీసీ చైర్మన్‌గా ముత్తిరెడ్డి

- జనగామ ఎమ్మెల్యేకు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి రాష్ట్ర పదవి
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- సేవలకు తగిన గుర్తింపు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన అనుచరులు

చేర్యాల, అక్టోబర్ 5 : ఆర్టీసీ చైర్మన్‌గా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జిగా 2009లో ఆరంగేట్రం చేసిన ముత్తిరెడ్డి నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలో తనదైన ముద్ర వేశారు. జనగామ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా పార్టీ హైకమాండ్ ముత్తిరెడ్డిని నియమించిన అనంతరం వచ్చిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో నాటి టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను ఓడించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో సైతం పొన్నాలను ఓడించి తన సత్తా చూపించారు. ముత్తిరెడ్డి సేవలను సీఎం కేసీఆర్ గుర్తించి చైర్మన్‌గా నియమించారు. ఇటీవల టీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేసిన ప్రభుత్వం సమర్థుడైన నేతను చైర్మన్ నియమించే క్రమంలో ముత్తిరెడ్డిని నియమించింది. ముత్తిరెడ్డిని టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా సీఎం కేసీఆర్ నియమించడంతో నియోజకవర్గ గులాబీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రెండేండ్లపాటు టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా కొనసాగనున్నారు.



రైలులో ప్రయాణికులు



రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

# రైలు ప్రయాణం షురూ..

**ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సిద్దిపేట రైల్వేస్టేషన్**

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 5 : సిద్దిపేట–సికింద్రాబాద్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 3న మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి రైలును ప్రారంభించగా, గురువారం నుంచి రెగ్యులర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి. దీంతో సిద్దిపేట రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. మొదటిరోజు రైలు ఎక్కేందుకు ప్రయాణికులు ఉత్సాహం చూపారు. కొంతమంది ప్రయాణికులు సెల్ఫీలు దిగి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉదయం, మధ్యాహ్నం సిద్దిపేట రైల్వే స్టేషన్ నుంచి రైళ్లు వెళ్లనుండగా, సికింద్రాబాద్ నుంచి సైతం ఉదయం, సాయంత్రం రెండు రైళ్లు సిద్దిపేటకు చేరుకోనున్నాయి.



ఆనందంతో సెల్ఫీలు తీసుకుంటున్న ప్రయాణికులు